RNI NO: APTEL/26/A7631

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 37 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 4 వెల రూ. 2 మంగళవారం -13 - అక్టోబర్ - 2026

Published From: Anatapuram circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు.. ఆమ్రపాలికి కీలక శాఖ

- ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

## తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

### తిరుపతి స్వరూపం మారనుంది.. వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- ★ అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- ★ టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- ★ భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- ★ నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు. మిగతా 2 లో

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు.. విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్




- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు
- విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన
- త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన..




### చార్జీల తగ్గింపుకు కసరత్తు

ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష

త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం

ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు




### రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే..

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఏపీ రైతు బజార్లలో కెఎన్ఎం సన్నబియ్యం విక్రయాలు

రూ.49కే అందుబాటులో ఉన్న బీపీటీ బియ్యం

పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్య




### జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
- మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ

### 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు

## మాతో టచ్‌లో ఉన్నారు..

### జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి

- ❖ రాహుల్ సంచలన వ్యాఖ్యలు
- ❖ అప్రూవర్‌గా మారాలని జ్ఞానేశ్‌కు రాహుల్ సూచన
- ❖ మోదీ, అమిత్ షా, దోవల్, అదానీ కలిసి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు
- ❖ జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య
- ❖ సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ



ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మిగతా 2 లో

## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు

### రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి

బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం

బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదు

ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి



ఢిల్లీ: బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మిగతా 2 లో




### ప్రజల దాహం కంటే బిర్లే ముఖ్యమా?

### ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ

# ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

### కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్

- ➢ కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్
- ➢ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- ➢ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు
- ➢ బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారు
- ➢ అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకు
- ➢ ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోంది



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ మిగతా 2 లో

### రోడ్లపై కాదు.. ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్




- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య
- ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన

హైదరాబాద్: ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి మిగతా 2 లో

## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు

ఢిల్లీ: బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం-6 లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం-6 లో ఎన్నికల సంఘం మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..
## టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం
## జనసైనికులు పోటీలో నిలుస్తారు: పవన్

పోలవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకవాడ గ్రామసభలో ఆయన ప్రసంగిస్తూ.. స్థానిక సమరానికి శంఖారావం పూరించారు. స్థానిక ఎన్నికల్లో జనసైనికులు పొత్తు ప్రకారం పోటీ చేస్తారని.. తెదేపా, భాజపా నాయకులకు ఎంత గౌరవం ఇస్తారో, తమ వాళ్లకూ అంతే మద్దతివ్వాలని కోరారు. 'నేను పార్టీ పెట్టినప్పుడు ఇక్కడి యువతంతా ఎర్ర తువ్వాళ్లు వేసుకుని వచ్చింది. అధికారంలోకి వస్తామో రామో తెలియదు.. వారికి తెలిసింది పోరాటమే.. ఆ ఎర్ర కండువానే ఆయుధం. 2014లో ఒక్క పదవీ ఆశించకుండా కూటమికి పనిచేశారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి చంద్రబాబును జైల్లో పెట్టింది. రోడ్లపైకి ఎవరూ రాని సమయంలో జనసైనికులు, వీరమహిళలు వచ్చి రాష్ట్రానికి భరోసా, ధైర్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో నేను రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేశా. స్థానిక ఎన్నికలు మీ భవిష్యత్తు.. మీ అవసరాల కోసం' అని అన్నారు. మూడు పార్టీలూ బాగుండాలని.. ఇప్పటికే జనసేన చాలా త్యాగం చేసిందని.. జనసైనికులు, వీరమహిళలు తగిన ప్రాతినిధ్యం వహించేందుకు అండగా నిలవాలని కోరారు.

## రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి

అమరావతి: 'ఎన్నికలు దగ్గర పడుతుండటం, ఇమేజ్ పడిపోవడంతో గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాల్ని ముమ్మరం చేస్తోంది. ఈ ఎన్నికలతో ఆ పార్టీకి, అభివృద్ధి నిరోధకులకు, రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి. అక్రమంగా ఆస్తులు సంపాదించిన జగన్ మనపై ఆరోపణలు చేస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అంతిమ లబ్ధిదారయిన జగన్.. ఆ విషయంలో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఈడీని మనమే పంపామని ఆరోపణలు చేస్తున్నారు' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు. 'బీసీలకు రిజర్వేషన్లు దక్కకూడదని, స్థానిక ఎన్నికలు జరగకూడదని గొడ్డలి పార్టీ న్యాయస్థానాలకు వెళ్లింది. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయాలని చూసింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు.. 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారు. వారికి న్యాయం చేయాలని ఏనాడూ భావించలేదు' అని సీఎం దుయ్యబట్టారు. రాజీవ్‌రంజన్ మిశ్రా కమిటీ సిఫార్సులు ఆమోదించి, బీసీలకు వీలైనంత ఎక్కువ మేలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు భంగం కలిగించకుండా బీసీలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 40 శాతం వరకూ రిజర్వేషన్లు కల్పించేలా కసరత్తు చేస్తున్నామని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి తెలిసేలా 'జయహో బీసీ.. జనాభాలో సగం-కూటమి ఇచ్చింది బలం' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం ఓట్లు పడాలని, ఇదే నేతల పనితీరుకు కొలమానమని పేర్కొన్నారు. దీన్నిబట్టే నేతలకు రేటింగ్స్ ఇస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతపై మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, నియోజకవర్గ పరిశీలకులు, ముఖ్యనేతలతో ఆదివారం చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం, కూటమి పార్టీలతో సమన్వయం, ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారాల్ని తిప్పికొట్టడంపై వారికి దిశానిర్దేశం చేశారు.

'మనం కూటమిలో ఉన్నాం. మిత్రధర్మం చాలా ముఖ్యం. కూటమి పార్టీల మధ్య పైస్థాయిలో ఎలాంటి సమన్వయం ఉందో.. క్షేత్రస్థాయిలోనూ అలాగే ఉండాలి. విభేదాలు, అపోహలకు తావివ్వొద్దు. నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మూడు పార్టీలు కలిసి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల ప్రచారం చేయాలి. తటస్థుల్ని పార్టీ సానుభూతిపరులుగా మార్చాలి. ప్రత్యర్థి పార్టీల వారిని తటస్థుల్ని చేయాలి. రాబోయే 50 రోజులు ఎవరికీ మినహాయింపు లేదు. కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి. గెలుపు, నిజాయతీ, సమర్థత, సోషల్ రీ-ఇంజినీరింగ్ వంటి అంశాల్ని బేరీజు వేసుకుని అభ్యర్థుల్ని ఎంపిక చేస్తాం. గొడ్డలి పార్టీ మూతపడేలా ఈ ఎన్నికల్లో కూటమి గెలుపు ఉండాలి. ఎమ్మెల్యేలంతా కార్యకర్తల మనోభావాల్ని బట్టి నడుచుకోవాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

డ్రామాలాడేవారిని ఉపేక్షించం..

నిజాయతీగా పనిచేయకుండా.. డ్రామాలాడేవారిని ఉపేక్షించబోమని చంద్రబాబు హెచ్చరించారు. 'స్థానిక ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవద్దు. కూటమి బలం మరింత పెరగాలంటే ఈ ఎన్నికలు కీలకం. ఇప్పటివరకూ సంక్షేమం కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశాం. చెత్త పన్ను రద్దు చేశాం. చక్కటి రోడ్లు వేశాం. ఇరిగేషన్‌కు పూర్వ వైభవం తెచ్చాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేశాం. పల్లె పండుగకు రూ.11 వేల కోట్లు, జేజేఎం పనులకు రూ.30 వేల కోట్లతో శంకుస్థాపన చేశాం. 5 లక్షల ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలు చేపట్టాం. మరో 3 లక్షల ఇళ్లకు భూమిపూజ చేశాం. పుర, నగరపాలికల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.11,359 కోట్ల విలువైన పనులు చేపట్టాం. 16.48 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని చంద్రబాబుపేర్కొన్నారు. ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, వాటిని క్లస్టర్ల వరకూ అందేలా చూడాలన్నారు.

## 2027 రుతుపవనాల నాటికి
## గోవాలో కాంగ్రెస్ సర్కార్!

హైదరాబాద్:'రావణుడు బీజేపీ అయితే, రాముడు కాంగ్రెస్. బీజేపీని ఓడించాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలి. గోవా ప్రజలు రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారు. మూడోసారి ఆ పార్టీని నమ్మొద్దు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసినా అది చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూరుస్తుంది. జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోంది. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారు. గోవాలో.. కాంగ్రెస్ పార్టీ కోసం కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలి. దేశంలో నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు చేరుకుంటాయి. 2026 రుతుపవనాల సమయంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2027 రుతుపవనాల నాటికి గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది..' అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని అన్నారు.

గోవాలో భూముల అన్యా క్రాంతం, డ్రగ్స్ దందాకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆక్రమణలు, కబ్జాలతో భూములు అన్యాక్రాంతం అయ్యాయని, మరోవైపు డ్రగ్స్ వ్యాపారానికి బీజేపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వడంతో యువత తప్పుదారి పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను సరిచేయాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గోవాలో భూముల అన్యాక్రాంతం, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును పరిరక్షించాలనే లక్ష్యంతో గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాఖోన్న్' యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

'గోవా ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోనే పరాయివారిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్య క్రమాల నేపథ్యంలో రాలేకపోయారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతినిధిగా నన్ను గోవాకు పంపించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్రా న్ని అభివృద్ధి చేయకుండా ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారు.

అందుకే ప్రజలు ఆయన్ను 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదు? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. గోవా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

### మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

### సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

### రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

## ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?
## ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..
## విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.

రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:

ఎస్టీ (ఒకటి): మంగళగిరి-తాడేపల్లి

ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు

బీసీ - మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ

బీసీ - జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు

జనరల్ - మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం

అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు
## కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## రోడ్లపై కాదు.. ఆధారాలతో
## ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్

హైదరాబాద్: ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..
## ఆమ్రపాలికి కీలక శాఖ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

ఇతర ముఖ్య నియామకాలు ఇలా ఉన్నాయి:

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి. కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు. బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి. ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి. ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది. గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.

ఇద్దరికి అదనపు బాధ్యతలు

ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం
## పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం
## రూ.50కే.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి: సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

అమరావతి: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు. మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
వై ఎస్ ఆర్ కడప జిల్లా
మంగళవారం - 13 - అక్టోబర్ - 2026

# శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



**భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి**

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 12:: జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు రామయ్య, లక్ష్మిరెడ్డి, రామరాజు, భాస్కర్, శేఖర్, వెంకటరాముడు, అంజన్ కుమార్, నాని, గోపాల్, సుబ్బారెడ్డితో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్య.. వెంటనే పరిష్కారం!

## గూడెంచెరువులో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 12: జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరతతో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గ్రామస్థులు తమ విద్యుత్ సమస్యను టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థుల సమస్యపై వెంటనే స్పందించిన భూపేష్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించడంతో సోమవారం గూడెంచెరువు గ్రామంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపిన భూపేష్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కో ఆర్డినేషన్ కమిటీ నిర్వాహక్ దల్ గా రెడ్డి ప్రసాద్



రాయచోటి , మహిన్యూస్ అక్టోబర్ 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంలో భాగంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి పార్లమెంట్ కో ఆర్డినేషన్ కమిటీ వారికి అందించేందుకు అసెంబ్లీ కో ఆర్డినేషన్ కమిటీని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. ఇందులో భాగంగా రాయచోటి పట్టణానికి చెందిన రెడ్డి ప్రసాద్ ను కో ఆర్డినేషన్ కమిటీ నిర్వాహక్ దల్ గా రెడ్డి ప్రసాద్ నియమించారు. ఈ సందర్భంగా రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి కట్టబెట్టిన అధ్యక్షులు, ఉప మంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా పార్టీలోనే అందరినీ కలుపుకొని పార్టీ అభ్యున్నతికి పాటుపడతానన్నారు.

# మత్స్యకారులకు చేపల వేటకు అనుమతి

## జూలై 1 నుంచి చేపల వేటకు అనుమతి.. అక్టోబర్ 13న వేలం

కడప జిల్లా మహి న్యూస్ అక్టోబర్ 12: వైఎస్సార్ కడప జిల్లాలోని మత్స్య అభివృద్ధి శాఖ పరిధిలో ఉన్న పెండ్లూరు చెరువు తదితర జలవనరుల్లో చేపల వేటకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన విడుదల చేశారు. 2026 జూలై 1 నుంచి 2027 జూన్ 30 వరకు చేపల పట్టుబడికి సంబంధించిన హక్కులను కేటాయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

### అక్టోబర్ 13న వేలం నిర్వహణ

మత్స్యశాఖ పరిధిలోని చెరువుల్లో చేపల వేట హక్కుల కేటాయింపు కోసం 2026 అక్టోబర్ 13వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

### వేలంలో పాల్గొనాలంటే నిబంధనలు

వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణయించిన నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బిడ్డర్ రూ.1,000 చొప్పున ధరావతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రిజర్వ్ ధర మొత్తం రూ.22,825గా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్న మత్స్యకారులు సంబంధిత మత్స్యశాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు, నిబంధనలు తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

# ప్రజా ఫిర్యాదులపై ఆర్డీఓ ప్రత్యేక దృష్టి

## అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. మురళి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు తదితర సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా పరిశీలించిన ఆర్డీఓ సంబంధిత తహసీల్దార్లు, శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతోపాటు నివేదిక సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆర్డీఓ ఎ. మురళి తెలిపారు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



# కడప రైతు బజార్‌లో బియ్యం ప్రత్యేక కౌంటర్లు ప్రారంభం

## కిలో బీపీటీ బియ్యం రూ.49.. కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ బియ్యం రూ.50




కడప జిల్లా, మహి న్యూస్, అక్టోబర్ 12: ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బియ్యం విక్రయాల కార్యక్రమంలో భాగంగా కడప రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ల ద్వారా బీపీటీ బియ్యాన్ని కిలో రూ.49కు, కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్లను జిల్లా సరఫరాల అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి, కడప తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. బియ్యం విక్రయాలు ప్రభుత్వ నిర్దేశిత ధరల ప్రకారం జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**ఎన్నికల కార్యక్రమాలపైనా దృష్టి సారించాలి**






కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: ప్రజా ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించి, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధీమీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యకు అనుగుణంగా సరైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పొంతనలేని నివేదికలు సమర్పించరాదని హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి స్థాయిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ లు రంగస్వామి, వెంకటపతి, శివరామిరెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివంగత గజ్జల నారాయణ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా అన్నదానం, వస్త్రదానం



ఖాజీపేట మహిన్యూస్ అక్టోబర్ 12: దివంగత గజ్జల నారాయణ రెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన స్మృతికి ఘనంగా నివాళులు అర్పిస్తూ వెంకట లక్ష్మి సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప జిల్లా ఖాజీపేట మండలం భూమాయిపల్లిలోని అమ్మ అనాథాశ్రమంలో అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలను నిర్వహించారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వారికి భోజనం అందించి, దుస్తులను పంపిణీ చేశారు. దివంగత గజ్జల నారాయణ రెడ్డి మద్య నిషేధ శాఖ వలయ పరిశీలకుడిగా సేవలు అందించారు. ఆయనను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మానవతా విలువలను చాటుతున్నారు. వ్యక్తి భౌతికంగా దూరమైనా, ఆయన జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో సజీవంగా నిలుపుకోవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. ఈ కార్యక్రమానికి అమ్మ అనాథాశ్రమం సంస్థ అధ్యక్షులు మల్లారెడ్డి, వెంకట లక్ష్మి సేవా సంస్థ అధ్యక్షులు కూన ఈశ్వర్ రెడ్డి హాజరయ్యారు. వెంకట లక్ష్మి సేవా సంస్థ సభ్యులు పి.వి. కృష్ణారెడ్డి, భవాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. దివంగత గజ్జల నారాయణ రెడ్డి కుమారుడు గజ్జల భాస్కర్ రెడ్డి, కోడలు గజ్జల సునీతా రెడ్డి, మనవరాలు జ్ఞానేశ్వరి రెడ్డి, మనవడు దీపక్ రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు తమ ఆత్మీయుని జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్రదానం నిర్వహించడం ద్వారా సమాజం పట్ల తమకున్న బాధ్యతను, పేదల పట్ల తమకున్న ఆదరణను చాటి చెప్పారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, అవసరంలో ఉన్నవారికి వస్త్రాలు అందించడం కేవలం దానం మాత్రమే కాకుండా, మానవత్వాన్ని పంచే గొప్ప కార్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటి చెప్పింది. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో దయ, కరుణ, సహకారం, సేవాభావాలను పెంపొందించడంతో పాటు, యువతకు కూడా స్ఫూర్తినిస్తాయి. సేవే మాధవ సేవ - మానవ సేవే మాధవ సేవ అనే ఆశయాన్ని ఆచరణలో చూపించిన ఈ కార్యక్రమం, దివంగత గజ్జల నారాయణ రెడ్డికి అర్థవంతమైన నివాళిగా నిలిచింది.

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలి



మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 12 : పి జి ఆర్ ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ ఏ. వెంకటేష్, ఎస్ డి సి లు చంద్రశేఖర్ రెడ్డి, మాధవరెడ్డి, నారాయణరెడ్డి, సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గత కలెక్టర్ల సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్ఫార్మెన్స్ (సానుకూల పనితీరు) ప్రజల నుండి సేకరించే అభిప్రాయాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కుర్చీలలో కూర్చొని వారి సమస్యలను తెలపగా జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ తదితర అధికారులు వారి సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

### ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..

1. నిమ్మనపల్లి మండలం, కొండయ్య గారి పల్లి పంచాయతీ గుండ్రెడ్డి గారిపల్లి కు చెందిన కే వెంకటరమణ, నిరుపేదమైన తనకు వృద్ధాప్య పెన్షన్ వస్తోందని, ప్రస్తుతం నడుము వంగిపోయి లేవలేని నడవలేని పరిస్థితిలో ఉన్నాను. సదరంలో 75 శాతం వికలాంగత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. వికలాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. 2.వాయల్పాడు మండలం మంచూరు గ్రామం సాకం వారి పల్లి మజరా కు చెందిన శ్రీ రాముల గారి భార్గవి, సెప్టెంబర్ మాసంలో తన భర్త మృతి చెందాడని, నిరుపేదలమైన తనకు జీవనాధారం పోయిందని, వితంతు పింఛను మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్‌కు అర్జీని సమర్పించారు. 3.



రాయచోటి మండలం అబ్బవరం పోస్టు కుమార పల్లె గ్రామానికి చెందిన వి చిన్నపరెడ్డి, గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జూన్ 1999 నుండి పూజారిగా నిత్యం ధూప దీప నైవేద్య సేవలు నిర్వహిస్తున్నందున, ధూప దీప నైవేద్యం పథకం క్రింద గౌరవ భృతిని మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 433 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి..!

**ఎన్నికల సన్నద్ధతపై అధికారులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు**

**రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి**



కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడుతో కలిసి కడప నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలను సమీక్షించి, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలు, విధివిధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నద్ధతపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ఓటరు జాబితాల ప్రచురణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పెట్టెల సమీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణకు అవసరమైన కాగితం సేకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఏర్పాటు వంటి అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించి నియామక ప్రక్రియ చేపట్టాలని, మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రవాణా సదుపాయాల ఏర్పాట్లపై గత ఎన్నికల అనుభవాలు, మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధులకు సిబ్బంది ఎంపికలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బందికి సంబంధించి నిర్దేశించిన అర్హతలు, నిబంధనలను పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల నుంచి మినహాయింపుల విషయంలోనూ నిబంధనలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వెలువడే మార్గదర్శకాలు, ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రాధాన్యమిస్తూ, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.



RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# సమాచార హక్కు చట్టం కింద నిర్ణీత గడువులో సమాచారం అందించాలి

**అర్జీదారులకు సకాలంలో సమాచారం ఇవ్వాలి**

**కార్యాలయాల్లో పీఐఓ, ఏపీఐఓల వివరాలతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి**

**సెక్షన్ 4(1)(బి) వివరాలను తప్పనిసరిగా నవీకరించాలి**



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): సమాచార హక్కు చట్టం కింద అర్జీదారులకు నిర్ణీత గడువులో సమాచారం అందించాలని డీఆర్వో ఏ. మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా వివిధ శాఖల హెచ్ఓడీలు, ప్రజా సమాచార అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం కింద వివిధ శాఖల పీఐఓలు, ఏపీఐఓల వివరాలను ఆయా కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. సెక్షన్ 4(1)(బి)కు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని, సమాచార హక్కు చట్టంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కలెక్టరేట్ పీఐఓ అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్

**వివిధ సమస్యలపై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, డీఆర్వో, వివిధ శాఖల అధికారులు**







అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డీఆర్వో ఏ. మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, వెంకట నారాయణ, రమేష్ రెడ్డి, కిరణ్మయి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బుక్కరాయసముద్రం చెరువులో 1.47 లక్షల చేప పిల్లల విడుదల

**ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రెండో విడతలో చేప పిల్లల విడుదల**

**మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు దోహదం**

**కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ**



సింగనమల, అక్టోబర్ 12: (మహి న్యూస్) : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం చెరువులో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కేంద్ర పథకం కింద రెండో విడతగా 1,47,000 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ అర్హులైన మత్స్యకారులకు సబ్సిడీపై సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదరణ-3 పథకం ద్వారా వలలు, పడవలు వంటి అవసరమైన పనిముట్లను అందించి



మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు సముద్ర మత్స్యకారులకు డీజిల్, పెట్రోల్ రాయితీలు కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో గ్రామీణాభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి అవసరమైన ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన (పి.డి) వై. శ్రీనివాసరావు







మహి న్యూస్ కొత్తపేట అక్టోబర్ 12 : మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో ఈ నెల 10,11వ తేదీ లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి కొత్తపేట మండలం, ఆవిడి గ్రామం చప్పిడివారిపాలెం హైస్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావు ( వైఎస్ఆర్ ) పాల్గొని షాట్ పుట్ విభాగంలో ఫస్ట్ ప్లేస్, డిస్కస్ త్రో విభాగంలో సెకండ్ ప్లేస్, ప్లేస్, ట్రిపుల్ జంప్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించి జనవరి 2027 ఉత్తరప్రదేశ్ లక్నో లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు వై. శ్రీనివాసరావును ను అభినందించారు.

# దసరా నవరాత్రుల సందర్భంగా దేవాలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు

**భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, మెరుగైన లైటింగ్ సౌకర్యాలు కల్పించాలి**

**క్యూలైన్లు, బ్యారికేడ్లు, సీసీటీవీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**

**ప్రధాన దేవాలయాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): దసరా పండుగ, నవరాత్రుల సందర్భంగా దేవాలయాలకు వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్




సి. విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా భక్తుల భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, దేవాలయాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన క్యూలైన్లు, అవసరమైన చోట బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, మెరుగైన లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 2,600 దేవాలయాలు ఉండగా, నవరాత్రుల సందర్భంగా ప్రధానంగా 10 దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండరామస్వామి దేవాలయం, శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవాలయం, శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం, కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయం, గవిమఠం, పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ కోసం దేవాలయాల కార్యనిర్వహణాధికారులు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమైన రోజుల్లో 24 గంటల విద్యుత్ సరఫరా, సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, అగ్నిమాపక భద్రత, మరుగుదొడ్ల నిరంతర శుభ్రత, నాణ్యమైన ప్రసాదం పంపిణీ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతకుముందు కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయ వేదపండితులు, అర్చకులు జాయింట్ కలెక్టర్‌కు వేదాశీర్వచనం అందించారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, డీఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, కసాపురం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, పెన్నహోబిలం ఈవో రమేష్ బాబు, ఈవోలు అక్కిరెడ్డి, నాగేంద్రుడు, ఎండోమెంట్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



# అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

**నేషనల్ చేంజ్ మేకర్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ గుజ్జుల హేమలత**

**తల్లిపాలు లేని శిశువులకు ఉచితంగా పాలు అందించడం దైవకార్యం**

**మిల్క్ బ్యాంక్ సిబ్బందిని అభినందించిన కలెక్టర్ ఓ. ఆనంద్**



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అనంత మదర్స్ మిల్క్



బ్యాంక్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. మిల్క్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, అనంతపురం జీజీహెచ్ డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జుల హేమలత నేషనల్ చేంజ్ మేకర్ అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు గౌరవమని తెలిపారు. గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీతో అనుసంధానమై పనిచేస్తున్న సమన్వై ప్రతిష్ఠాన్ వడోదర స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 51 మందికి నేషనల్ చేంజ్ మేకర్ అవార్డులను ప్రదానం చేసింది. ఈ అవార్డులను సంస్థ ప్రతినిధి డాక్టర్ అజయ్ రాంకా ఇటీవల అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అవార్డుకు డాక్టర్ గుజ్జుల హేమలత ఎంపికయ్యారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డాక్టర్ హేమలత తన బృందంతో కలిసి కలెక్టర్ ఓ. ఆనంద్‌ను కలిసి అవార్డును చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. తల్లిపాలు అందక ఇబ్బందులు ఎదుర్కొనే శిశువులకు మిల్క్ బ్యాంక్ ద్వారా ఉచితంగా పాలు అందించడం గొప్ప సేవ అని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లి తన బిడ్డకు అవసరమైన పాలు ఇచ్చిన తర్వాత మిగిలిన పాలను సేకరించి, శాస్త్రీయంగా భద్రపరిచి తల్లిపాలు అందుబాటులో లేని చిన్నారులకు అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. స్వచ్ఛందంగా పాలు అందిస్తున్న తల్లులకు కృతజ్ఞతలు తెలిపారు. మిల్క్ బ్యాంక్ ప్రారంభమైన కొద్ది కాలంలోనే జాతీయ స్థాయి అవార్డు రావడం వెనుక సిబ్బంది చిత్తశుద్ధి, అంకితభావం, నిస్వార్థ సేవ ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ రాధిక, డాక్టర్ ప్రవీణ్, స్టాఫ్ నర్సులు సునీత, మానస, బోయ సుకన్య, హైమావతి, రమాదేవి, సిబ్బంది రాధ, పల్లవి, నాగమణి, సాయికుమార్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో పంటల సాగు చేపట్టాలి

**ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించాలి ఖరీఫ్ ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన పంటలను ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో సాగు చేస్తూ, ఏపీసీఎన్ఎఫ్ విధానాలను అనుసరించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సి.



విష్ణుచరణ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో పీఎండీఎస్ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సాంకేతిక సలహాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఉద్యాన పంటల ప్లాంటేషన్లలో ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, డ్వామా కింద కొత్తగా చేపట్టే తోటల్లో ఒకే పంటకు బదులుగా మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. డీఆర్‌డీఏ, ఏపీసీఎన్ఎఫ్ సమన్వయంతో మహిళా సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల ద్వారా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఖరీఫ్ 2026 ఈ-పంట నమోదులో ఇప్పటివరకు 10.8 శాతం మాత్రమే పూర్తయిందని, మూడు, నాలుగు రోజుల్లో ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకుని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. పల్లె పండుగ 3.0 కింద మంజూరైన 1,326 సీసీ రోడ్డు పనుల్లో 1,030 పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మంజూరైన 39 బీటీ రోడ్డు పనుల్లో 33 పురోగతిలో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రావెల్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని, జలధార, జలహారతి ఫేజ్-2 పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్‌లో 49 గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ-కేవైసీ పూర్తి చేసి పాసుపుస్తకాలు సిద్ధం చేయాలని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన 627 పనుల్లో 426 పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో నమోదైన 1,37,248 మంది ప్రతిరోజూ హాజరు నమోదు చేసేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ సలీమ్ భాష, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, ఉద్యాన శాఖ డీడీ ధనుంజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

# యానంలో ట్రేడ్ లైసెన్సులు లేకుండానే దీపావళి షాపులు!

యానం, మహి న్యూస్, అక్టోబర్ 12: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో పుదుచ్చేరి మున్సిపల్ యాక్ట్ 1973, ఎక్స్ ప్లోసివ్ రూల్స్ 2008 మరియు ఎక్స్‌ప్లోసివ్ 1884 ను ఉల్లంఘిస్తూ 14 పర్మినెంట్ బాణాసంచా దుకాణాలు మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు లేకుండానే విచ్చలవిడిగా బాణాసంచా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2026 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోకుండానే కొందరు వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై పలువురు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సాధారణంగా వ్యాపార లైసెన్సుల గడువు ముగిసిన అనంతరం నిబంధనల ప్రకారం వాటిని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీపావళి




పండుగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల నిర్వహణలో నిబంధనలు పాటిస్తున్నారా? అవసరమైన అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

దుకాణాలలో 100 కిలోలు మించి బాణాసంచా సామాగ్రి ఉండకూడదని నిబంధనలు ఎప్పుడో గాలికి వదిలేసారు.

దీపావళి సమయంలో బాణసంచా విక్రయాలు, నిల్వల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు, భద్రతా ప్రమాణాల అమలుపై ముందస్తు చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యానంలోని దీపావళి దుకాణాలను తనిఖీ చేయాలని, ట్రేడ్ లైసెన్సులు, అవసరమైన ఇతర అనుమతులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com